andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.7 । కనిష్ఠం 23.8
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
బుధవారం 16 ఏప్రిల్ 2025



సూపర్ బీడీ కంపెనీని తెరిపించాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలోని సూపర్ బీడీ కంపెనీని తెరిపించాలని తెలంగాణ బీడీ రోలర్స్ యూనియన్ అధ్యక్షుడు ఉప్పు లక్ష్మణ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ బీడీ కంపెనీలో 152 బ్రాంచీలు ఉన్నాయని దీనిలో 10 వేల మంది పని చేస్తున్నారని తెలిపారు. ఈ కంపెనీ ఏ కారణం లేకుండా 20 రోజుల నుంచి బీడీ కార్మికులకు పని బంద్ చేశారని దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే కంపెనీ తెరిపించేలా కార్మిక శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నామన్నారు.



భూభారతితో..
చిక్కులు తొలిగేనా?

- ధరణి సమస్యలకు పరిష్కారం చూపేనా?
- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ధరణి భూ సమస్యలు
- జిల్లాలో ఇప్పటికీ పెండింగ్‌లో 13 వేలకు పైగా దరఖాస్తులు
- ధరణి లోటు పాట్లను సవరించేందుకు ఆర్‌ఓఆర్ చట్టం
- భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్‌గా లింగంపేట మండలం
- వివాదాల్లో మండలంలోని 7 గ్రామాల్లో 1,663 ఖాతాలు
- ఈనెల 17 నుంచి రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామసభలు
- నేటి నుంచి భూ భారతి పోర్టల్‌లోనే రిజిస్ట్రేషన్లు

కామారెడ్డి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): భూ వివరాలు పారదర్శకం, సమస్యల పరిష్కారానికి సులువైన మార్గం అంటూ గత ప్రభుత్వం 2019లో ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. భూముల క్రయ విక్రయాలతో పాటు రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండేలా ఆ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు భూ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించినా రైతాంగానికి కొత్త చిక్కులు ఎదురయ్యాయి. చాలా గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారం దొరకక గొడవలు చెలరేగాయి. పలువురు కేసుల్లో ఇరుక్కుని నానా ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. మండల, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్‌లకు వస్తున్న ఫిర్యాదుల్లో భూ సమస్యలు, వివాదాల పైనే ఎక్కువగా ఉంటుండడం గమనార్హం. అదేవిధంగా ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి సైతం భూ సమస్యలపైనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తున్న భూ భారతీతోనైన భూ సమస్యల చిక్కులు తొలుగుతాయని బాధిత రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు.

పరిష్కారానికి నోచుకోని ధరణి దరఖాస్తులు

గత ప్రభుత్వం 8 ఏళ్ల కిందట తీసుకువచ్చిన ధరణి భూ సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ధరణికి భూ సమస్యలపై 50,494 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 34,503 దరఖాస్తులు ఆమోదం పొందినవి ఉన్నా యి. 10,700ల దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించారు. మరో 3,271 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో పెండి ంగ్ భూ సమస్యల పరిష్కారానికి ఖచ్చితమైన ఆప్షన్‌లు లేకపోవడం, క్షేత్రస్థాయి విచారణకు సిబ్బంది కొరత సమస్యగా మారిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. సాంకేతిక చిక్కుల పరిష్కారానికి ఎన్నో ఆప్షన్‌లను ప్రవేశపెట్టినప్పటికీ మూడు కేటగిరీల్లో నమోదైన దరఖాస్తులు అత్యధికంగా తిరస్కరణకు గురవుతున్నాయి. జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంటుంది. గతానికి భిన్నంగా దరఖాస్తులు తహసీల్దార్ నుంచి ఆర్డీవోకు ఆ తర్వాత అదనపు కలెక్టర్, కలెక్టర్ లాగిన్‌కు చేరాల్సి ఉండేది. దీంతో దరఖాస్తుల పరిష్కారంలో కొంతమేర జాప్యం జరుగుతూ వచ్చింది. మూడు స్థాయిలో నోట్ ఫైల్ సిద్ధం చేయడం, సెధ్వార్, కాస్రా పహాణిలతో పాటు ఆర్ఎస్ఆర్ రిజిస్టర్‌లు పరిశీలించాల్సి వచ్చేది. దీంతో పలు దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించే సిబ్బందికి అవగాహన, అవసరమైన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో అధిక సంఖ్యలో తిరస్కరణకు గురవతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పైలెట్ ప్రాజెక్టుగా లింగంపేట మండలం

కామారెడ్డి జిల్లాలో భూ భారతి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన లింగంపేట మండలం పరిధిలో గ్రామ పంచాయతీలు 41 ఉన్నాయి. ఇందులో రెవెన్యూ గ్రామాలు 23 ఉన్నాయి. ఈ రెవెన్యూ గ్రామాల పరిధిలో రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం 10,098 సర్వే నెంబర్లు ఉండగా వీటిలో 61,175 ఎకరాల్లో భూ విస్తీర్ణం ఉంది. ఇందులో 26,275 ఎకరాల్లో వ్యవసాయ సాగు భూమి ఉండగా 18,142 ఖాతాలను రెవెన్యూ అధికారులు జారీ చేశారు. అటవీ భూములు 3,044 ఎకరాల్లో ఉండగా వీటి పరిధిలో 278 సర్వే నెంబర్లు ఉన్నాయి. అసైన్డ్ భూములు 12,722 ఎకరాల్లో ఉండగా వీటి పరిధిలో 10,199 సర్వే నెంబర్లు ఉన్నాయి. మండల పరిధిలో సంవత్సరాల తరబడి అటవి, రెవెన్యూ భూముల హద్దులు తెలియక పలు పట్టా భూములకు పాసు పుస్తకాలు రావడం లేదు. మండలంలోని 1,663 ఖాతాలు వివాదంలో ఉండడంతో వీటిని పార్ట్ బీలో చేర్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వివాదాల్లో ఉన్న ఖాతాలు ఎక్కువగా శెట్పల్లి సంగారెడ్డి, పోతాయిపల్లి, ముంబాజీపేట, కొండాపూర్, భవానిపేట, మోతె, లింగంపల్లి (ఖుర్దు) గ్రామాల్లో ఉన్నాయి. వివాదంలో ఉన్న ఖాతాల బాధిత రైతులకు సంవత్సరాల తరబడి పాసు పుస్తకాలు మంజూరు కాక పలు పథకాలకు బాధిత రైతులు దూరమవుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలోని ఎక్కువ భూములు అటవీశాఖ పరిధిలో ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉన్నాయి. మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 983 రెవెన్యూ కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలు కొన్ని ఇళ్లు సైతం అటవీ భూముల్లోనే ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో అటవీ, రెవెన్యూ భూముల హద్దులు తెలియక ప్రధాన రహదారుల పనులు సైతం సంవత్సరాల తరబడి నిలిచిపోయాయి. భూ భారతితోనైనా ఈ వివాదంలో ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

17 నుంచి గ్రామసభలు

పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించడంతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూముల క్రయ విక్రయాలకు రిజిస్ట్రేషన్లు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతిని అమలులోకి తీసుకువచ్చింది. పైలెట్ ప్రాజెక్టు కింద లింగంపేటను ఎంపిక చేయడంతో ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన భూ భారతి పోర్టల్ ను అందుబాటులోకి వచ్చింది. లింగం పేట తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి పోర్టల్ ద్వారానే రిజిస్ట్రేషన్లు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భారతి పోర్టల్‌పై రిజిస్ట్రేషన్లపై సిబ్బందికి శిక్షణను ఇచ్చారు. భూ భారితి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకొన్న రైతులకు భూముల రిజిస్ట్రేషన్‌ను 16 నుంచి చేస్తున్నారు. మండలంలో ఈనెల 17 నుంచి ప్రతీ రోజు రెండు రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు.

పారదర్శకత పెరిగే అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలులోకి తీసుకురానున్న కొత్త ఆర్‌ఓఆర్ చట్టం, భూ భారతితో భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత నెలకొంటుందని దళారుల వ్యవస్థ అరికట్టవచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అన్ని రకాల సేవలకు కలెక్టర్‌లతో ముడిపడి ఉండగా తాజా చట్టంతో తహసీల్దార్లకు, ఆర్డీవోలకు బదలాయింపును కేటాయించారు. ముఖ్యంగా మ్యూటేషన్, సాదా బైనామా, ఓఆర్‌సీ అప్పీల్‌కు సంబంధించిన అంశాలను ఆర్డీవోలకు అందించనుండగా, పౌతి, వీరసత్‌తో పాటు మరికొన్ని అంశాలను తహసీల్దార్‌లకు అప్పగించనున్నారు. ఇక కలెక్టర్ స్థాయిలో ఇప్పటి వరకు ఉన్న పని భారం ఆర్డీవోలకు, తహసీల్దార్‌లకు ఆయా అంశాలు బదలాయించడంతో కలెక్టర్‌లపై పని భారం తగ్గనుంది. ఇప్పటి వరకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉండగా ప్రస్తుతం తహసీల్దార్ స్థాయిలో జరిగిన తప్పిదాలపై ఆర్డీవో స్థాయిలో అక్కడ న్యాయం జరగని పక్షంలో అదనపు కలెక్టర్ స్థాయిలో అప్పీల్‌కు వ్యవస్థను తీసుకురానున్నారు. ఈ వ్యవస్థ లేకపోవడంతో ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి అనేక కేసులు నమోదైనట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తోంది.

జిల్లాలో భూభారతిపై విస్తృత ప్రచారం కల్పించాలి

- ఈనెల 17 నుంచి 30 వరకు అవగాహన చేపట్టాలి
- సదస్సులకు 200 మందికి తక్కువ కాకుండా ప్రజలు, రైతులను తరలించాలి
- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూభారతిపై విస్తృత ప్రచారం చేసి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, తాగు నీరు, రేషన్‌కార్డుల వెరిఫికేషన్‌పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 30 వరకు లింగంపేట మండలం మినహా మిగిలిన మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. ప్రతీ మండలంలోని రైతువేదిక, ఇతర ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసి 200 మందికి తగ్గకుండా ప్రజలను, రైతులను తరలించాలని సూచించారు. ప్రతి మండలానికి రూ.10వేల నిధులు కేటాయించడం జరుగుతుందని మైక్,టెంట్లు, తాగునీరు, ఫ్లెక్సీ కరపత్రాలు, ఇతర ఏర్పాట్లకు వినియోగించాలని తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద లింగంపేట మండలంలో నిర్ణయించిన సమస్యలకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రోజుకు రెండు మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రజలకు ధరణి వల్ల కలిగిన ఇబ్బందులతో కోర్టుకు వెళ్లారని, భూ భారతి వల్ల నిర్ణీత గడువులోగా ఉన్నతాధికారులకు అప్పీల్ చేయవచ్చని తెలిపారు. భూభారతి చట్టంపై తహసీల్దార్‌లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో ఉన్న దరఖాస్తులను డిస్పోజల్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీలకు లబ్ధిదారుల జాబితాను ఈనెల 18 నుంచి 21లోగా ఇవ్వడం జరుగుతుందన్నారు. 22 నుంచి 30 వరకు గెజిటెడ్ అధికారులు ఎంపీడీఓ, ఎంపీఓ, మండల వ్యవసాయాధికారులు వెరిఫై చేయాలని తెలిపారు. మే 2న ఆయా జాబితాలను గ్రామసభలో పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పర్యవేక్షణకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేకాధికారులను నియమించడం జరిగిందని బాన్సువాడకు సబ్ కలెక్టర్ కిరణ్మయి, జుక్కల్‌కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, కామారెడ్డికి ఆర్‌డీఓ వీణ, ఎల్లారెడ్డికి ఆర్‌డీఓ ప్రభాకర్‌లను కేటాయించామని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి

- బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయని పార్టీలను క్షమించేది లేదు
- స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలి
- రిజర్వేషన్‌ల అమలుకు మే నెలలో బీసీల యుద్ధభేరి నిర్వహిస్తాం
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం 15 నెలల తర్వాత బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిందని అన్నారు. తాము ఏ పార్టీలకు అనుకూలం కాదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకపోవడంతో పోరాటం చేసి రిజర్వేషన్‌లను అమలు చేసేలా కృషి చేశామని తెలిపారు. కానీ ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లుకు విముఖత చూపడం తగదని అన్నారు. ఇటీవల బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఢిల్లీలో పోరాటం చేశామని తెలిపారు. మత ప్రాదిపదికన రిజర్వేషన్‌లు అమలు చేయమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంటున్నారని మరి వారు పరిపాలించే రాష్ట్రాల్లో ఇతర మతాలకు చెందిన వారికి ఎందుకు రిజర్వేషన్‌లు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. 8 శాతం ఉన్న అగ్రకులాలకు 10 శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ అమలు చేస్తున్నప్పుడు మరి దేశంలోనే 70 శాతం ఉన్న బీసీలకు ఎందుకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయరో చెప్పాలని అన్నారు. అసెంబ్లీలో, గల్లీలోని బీజేపీ బీసీ రిజర్వేషన్ బిల్లుకు



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

సహకరిస్తే ఢిల్లీలోని బీజేపీ బీసీ రిజర్వేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తుందని అన్నారు. బీసీలు లేనిది దేశం లేదని 11 సంవత్సరాల 5 నెలల బీజేపీ పరిపాలన కాలంలో 72 మంత్రిత్వ శాఖలు ఉండగా అందులో ఒకటి బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కేంద్ర బడ్జెట్ 52 లక్షల కోట్లు పెడితే అందులో రూ.2700 కోట్లు కేటాయిస్తే దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు కనీసం చాక్లెట్‌లు కొనుక్కోవడానికి కూడా డబ్బులు సరిపోవని అన్నారు. బీసీ రిజర్వేషన్ అమలు చేయకపోతే దేశంలోని 29 రాష్ట్రాల్లో పర్యటించి బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలకు వివరిస్తామని అన్నారు. బీజేపీ పాలించని రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించి మే నెలలో 10 లక్షల మంది బీసీలతో కలిసి హైదరాబాద్‌లో బీసీ యుద్ధభేరి నిర్వహిస్తామని తెలిపారు. బీసీలకు అన్యాయం చేసే ఏ పార్టీలను వదిలిపెట్టమని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా బీసీలు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిందేనని అన్నారు. ఇక రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌లకు సహకరిస్తున్నామని చెబుతోంది కాని 42 శాతం సబ్ ప్లాన్ నిధులతో పాటు నామినేటెడ్ పోస్టులలో రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనం గంగాధర్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షుడు మోహన్ చారి, మధు, భాస్కర్‌గౌడ్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి మల్లన్న, శ్రీనివాస్‌గౌడ్, దాసరి గంగాధర్, షైమద్, రవి, విజయలక్ష్మీ, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ విధ్వంసానికి పరిష్కారం భూభారతి

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ విధ్వంసానికి పరిష్కారం భూభారతి అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తెలిపారు. భూభారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం ద్వారా భూమి హక్కుల భద్రం, భూసమస్యల సత్వర పరిష్కారం రైతుల మేలు కోసం కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ధరణి ప్రజలకు శాపం అయితే ప్రజల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారానికి భూభారతి వరం కానుందని తెలిపారు. భూభారతి చట్టంతో ప్రజల కష్టాలన్నీ తీరుతాయని తెలిపారు. ఎన్నో తరాలుగా మహానీయులు పేద ప్రజల కోసం చేస్తున్న పోరాటం భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఎంతో మంది స్ఫూర్తితో వారి ఆశయాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన చట్టమే భూభారతి అని అన్నారు.

భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయని నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎండకాలంలో భూగర్భ జలాల సంరక్షణ కోసం పాంపాండ్స్, బోర్‌వెల్ రీచర్జ్ స్ట్రక్చర్, ఇంకుడు గుంతలు, సోక్‌పిట్స్ ఎక్కువ నిర్మించాలని, వచ్చే వర్షాకాలంలో ప్రతీ వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలాగా దానికి తగిన విధంగా యాక్షన్ ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, భూగర్భ జల అధికారి సతీష్‌యాదవ్, డీఆర్‌డీఓ పీడీ సురేందర్, జిల్లా వ్యవసాయాశాఖాధికారి తిరుమల ప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులతో కలిసి నిరాహార దీక్షలు చేపడుతాం

- బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల అవుట్ సోర్సింగ్ బాధితులతో కలిసి త్వరలో నిరాహార దీక్షలు చేపడుతామని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌నాయక్‌లు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో అవకతవకలు జరిగాయని కలెక్టర్‌కు గత 18 రోజుల క్రితం బాధిత అభ్యర్థులతో కలిసి వినతి పత్రం అందిస్తే విచారణ చేస్తామని తెలిపారని, ఆ తర్వాత వారం క్రితం ప్రజావాణిలో వినతి పత్రం అందించినా ఎలాంటి స్పందన లేదని అన్నారు. అన్ని రుజువులతో సహ కలెక్టర్‌కు వినతులు సమర్పిస్తే విచారణలో జాప్యం చేయడం దారుణమని తెలిపారు. ఇక మీదట ఉద్యమానికి సిద్ధమవుతామని త్వరలో బాధితులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతామని అప్పటికీ న్యాయం జరగకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు రవి, అరవింద్, సంజయ్, గణేష్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పోలీసులపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు

లింగంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ జయంతి రోజున ఒక దళిత నాయకుడు మాజీ ఎంపీపీ ముదాం సాయిలును బట్టలూడదీసి అర్ధ నగ్నంగా ఈడ్చుకుపోయి అరెస్టు చేసిన పోలీసులపై మంగళవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురెందర్ ఆధ్వర్యంలో దళిత సంఘం నాయకులు హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. దళిత నాయకున్ని అవమానపర్చిన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవానలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదును పరిశీలించిన చైర్మన్ కామారెడ్డి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి దళితులను అవమానపర్చిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురెందర్, దళిత సంఘం జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బాన్సువాడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, బాన్సువాడలో గులాబీ జెండా ఎగురవేస్తామని ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. బాన్సువాడ పట్టణంలోని భారత్ గార్డెన్‌లో మంగళవారం ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ మహాసభ సందర్భంగా బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కవితతో పాటు మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్ ఆశన్న, జీవన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని తాడ్కోలు చౌరస్తా నుంచి బైక్ ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా పోలీస్ కిష్టయ్య చౌరస్తా మీదుగా భారత్ గార్డెన్‌కు చేరుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ జెండాను ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ



బాన్సువాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరింపులకు పాల్పడుతున్నారని అలాంటి బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని బెదిరింపులకు పాల్పడుతున్న నాయకులను, అధికారులను ఎట్టి పరిస్థితిల్లో వదిలేది లేదని అలాంటి వారి పేర్లను పింక్ బుక్కులో నమోదు చేసుకుంటామని ఆమె హెచ్చరించారు. వారికి తగిన గుణపాఠం చెబుతామని ఆమె అన్నారు. పార్టీని మోసం చేసిన వారిని పార్టీకి ద్రోహం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలబోమని ఆమె హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. రజతోత్సవ మహాసభకు ఇంటికొకరు చొప్పున తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మాట తప్పే ప్రభుత్వమని, ఇక్కడి నాయకులు డబ్బు కోసమే కాంగ్రెస్ పార్టీలోకి వలస వెళ్లారని ధ్వజమెత్తారు. బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, కార్యకర్తల జోలికి ఎవరొచ్చినా ఊరుకోనని హెచ్చరించారు. నేను కొంచెం రౌడీ లాంటిదని తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తి లేదని, తాతలు ముత్తాతలు జేజమ్మలు ఎవరు వచ్చినా ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్, సాయిబాబా, మోచి గణేష్, రమేష్ యాదవ్, శివసూరి, బోడ చందర్, గౌస్, చందు, మహేష్, ఆనంద్ గౌడ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడను బంగారు వాడగా మార్చిన ఘనత కేసీఆర్‌దే..

కేసీఆర్ హయాంలోనే బాన్సువాడ బంగారు వాడగా మారిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. బాన్సువాడ సమీపంలోని చింతల్ నాగారం మంజీరా నదిపై నిర్మించిన చెక్ డ్యామ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాన్సువాడకు 10 సంవత్సరాల్లో రూ. పదివేల కోట్ల నిధులు మంజూరు చేశారని అన్నారు. అయినా కూడా స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రజలను కాదని పార్టీ మారారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇలాంటివి నాలుగు చెక్ డ్యాములు నిర్మించినట్లు తెలిపారు. ఈ చెక్‌డ్యాంపై ఆధారపడి 1600 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారని అన్నారు.

వర్నిలో బాజిరెడ్డి పర్యటన



వర్నిలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే

వర్ని,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలో మంగళవారం బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పర్యటించారు. బాన్సువాడలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు తరలివెళ్తూ వర్నిలో పార్టీ కార్యకర్తలను కలిశారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జై తెలంగాణ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎజాజ్, తాహెర్, అంబెం నరేందర్, నరెడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి చేరిన మాజీ సర్పంచ్‌లు



మాజీ సర్పంచ్‌లకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మెండోర, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ సర్పంచ్‌లు మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీల చేరారు. ఈ సందర్భంగా సోన్‌పేట్ మాజీ సర్పంచ్ గోలి ప్రకాష్, దూదిగాం మాజీ సర్పంచ్ పసుల శ్రీనివాస్‌ల మిత్ర బృందంకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తిగా భ్రమలు తొలిగిపోయాయని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు మళ్ళీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు.ఈకార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మండల అధ్యక్షుడు నాగంపేట్‌శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కమలాకర్, మాజీ ఎంపీటీసీ దేవేందర్,బాబా,మాజీసర్పంచ్‌లు నాగుల నర్సయ్య,గంగారెడ్డి, రాజారెడ్డి, గంగారెడ్డి, యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):మండలంలోనిగోను గొప్పుల గ్రామా నికి చెందిన గోపరి ఓడ్డన్న అనే వ్యక్తి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైయివేట్ ఆసుపత్రిలో చేరారు.ఆయన నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి అని వైద్యఖర్చులు భరించలేని పరి స్థితిలో ఉండడంతో గ్రామ బీఆర్ఎస్ నాయకులు బాల్కొండ ఎమ్మె ల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో వైద్య చికిత్స కోసం రూ.లక్ష10వేల ఎల్‌వోసీ ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి మంగళవారం వేల్పూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంజూరు పత్రా న్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.మంజూరుకు కృషి చేసిన ప్రశాంత్‌రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): అనుకోకుండా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ ఇన్‌చార్జి అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ డిపో, బస్ స్టేషన్ ప్రాంతాలలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బోధన్ రైల్వే స్టేషన్ మేనేజర్ రాములు, ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్, అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, ఆనంద్, రాహుల్, మొసిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'కులధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదు'



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహమ్మద్‌నగర్,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గాలిపూర్ గ్రామంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును నాయక్ పోడ్ కులస్తులు కలిశారు.ఈసందర్భంగా నాయక్ పోడ్ జిల్లా అధ్యక్షుడు మెట్టపెంటయ్య మాట్లాడుతూ తహసీల్దార్‌కు కులధ్రువికరణ పత్రం ఇవ్వాలని పలుమార్లు కలిసిన పత్రం జారీచేయకపోగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు.బాన్సువాడ సబ్ కలెక్టర్ వద్దకు, తహసీల్దార్ కార్యాలయాలకు మూడునెలలుగా తిరిగిన స్పందించడం లేదని ఆరోపించారు. వెంటనే ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌చేసి నాయక్‌పోడ్ కులధృ వీకరణ పత్రాల గురించి తెలియజేసి వారి సమస్యను తీర్చాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మార్కెట్ కమిటి చైర్మన్ మనోజ్, మం డలల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, జిల్లాఎస్‌టీసెల్ ఉపా .ధ్యక్షుడు లోక్యా నాయక్, ఆకాష్, నాయక్‌పోడ్ సంఘనాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల పరిశీలన పూర్తి చేయాలి

నిజాంసాగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దరఖాస్తుదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిశీల పూర్తి చేయాలని ప్రత్యేక అధికారిని ప్రమీల తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రజాపాలనగా వచ్చిన ఇందిరమ్మ ఇండ్ల రేషన్ కార్డుల, ఎన్ఆర్ఇజిఎస్, ఎల్ఆర్ఎస్ పై వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారీగా గ్రామపంచాయతీ కార్యదర్శులు పరిశీలి పరిశీలన చేసి నివేదిక అందించాలని అన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ బిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, ఏపీ శివకుమార్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు

ఎంపీడీవోలో అంబేద్కర్ ఫొటో ఏర్పాటు చేయాలి

కోటగిరి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఫోటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయకపోవడం అత్యంత బాధకరమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు పోచీరాం ఆవేదన వ్యక్తం చేశారు.పొతంగల్ మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం లేకపోవడంతో మంగళవారం ఆయన నిరసనవ్యక్తం చేశారు.ఎంపీడీవో కార్యాలయంలో సీఎం,ఎమ్మెల్యే పోచారం, ఫోటోలు మాత్రమే ఏర్పాటు చేశారన్నారు.ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.మండల పరిషత్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించకపోవడంపై ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలి

● రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్



రుద్రూరులో పాదయాత్ర నిర్వహిస్తున్న తాహెర్‌బిన్ హందాన్

కోటగిరి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వాతంత్ర సమయయోధులను, రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతను అవమానపరుస్తుందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ఆరోపించారు. రుద్రూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మహాత్మ గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలతో ప్రధాన వీధుల గుండా నినాదాలు చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం తమ వాటా ఉందని గొప్పలు చెప్పడం సిగ్గుచేటన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాలలో సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీ మాటలు విని మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణలో సుస్థిరపాలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, అరుణ్ కుమార్, గంగారాం, గంగాశంకర్, నాగేష్, ప్రవీణ్, సురేష్, అశోక్,షేక్.గౌస్,సంగయ్య, కార్తీక్,సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

సుంకెట్,మోర్తాడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవం



పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొన్న ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ మంజుల

మోర్తాడ్ ,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):మండలంలోని సుంకెట్, మోర్తాడ్ గ్రామాల్లోని అంగన్‌వాడి కేంద్రాలలో పోషణ పక్షం కార్యక్రమాలు భారీగా నిర్వహించారు.సుంకెట్ గ్రామంలో అన్ని అంగన్‌వాడి కేంద్రాలు కలిసి ఒకచోట పోషణ పథకం ప్రారంభించారు. గర్భిణులకు రక్త పరీక్షలు, సీమంతాలు, అన్నప్రసన, అక్షరభ్యాసం, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతం నిర్ధారించివారి తల్లులకు ఎటువంటి పోషకాహారం ఇవ్వాలో వివరించి చెప్పారు. మోర్తాడ్‌లో కూడా జరిగిన పోషణ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు జ్యోతి, శారద,రిషిక్,సుజాత,రాజేశ్వరి,స్వర్ణలత, అంజమ్మ, సుమలత,ఆశారేఖ పాల్గొన గా సుంకెట్‌లో ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్ వైజర్ మంజులా, అంగన్‌వాడి టీచర్లు దేవగంగు,పుష్పలత,సుజాత,స్వప్న,ఆయాలు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

డొంకేశ్వర్:పిల్లల శారీరక , మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అన్నపూర్ణ మంగళవారం పోషన్‌పక్షం కార్యక్రమంలో భాగంగా సామూ హిక సీమంతాలు, అన్న ప్రసన, పౌష్టికాహారం మహోత్సవం కార్యక్రమా లను మండలంలోని గాదెపల్లి అంగన్‌వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పిల్లల బరువు, ఎత్తు చూసి తల్లిదండ్రులకు తెలియజేయాలని అంగన్‌వాడి టీచర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ కళావతి, ఎంఎల్‌హెచ్‌పి అమూలయ రజిని, రామ కృష్ణ, నాగరాజ్, అచ్యుత్‌రెడిడ, రాజన్న, అంగన్‌వాడి టీచర్‌లు తదితరులు పాల్గొన్నారు.

● కల్దుర్కిలో పోషణ పక్వాడ

బోధన్‌రూరల్: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కల్దుర్కి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి గర్భవతి నుండి రెండు సంవత్సరాల పిల్లల వరకు అందించే పౌష్టికాహారం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ సునీత, సైన్స్ ఉపాధ్యాయురాలు నవత కుమారి, వైద్యసిబ్బంది శిల్ప, అంగన్‌వాడీ టీచర్లు వత్సల, సాయమ్మ, సునంద తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

● బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముత్యాల సునీల్ కుమార్

మోర్తాడ్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు సంక్షే మ పథకాలు అందకుండా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని బదునం చేయాలని చూస్తున్నారని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. మండళవారం మోర్తాడ్‌లోని ప్రజా భవనంలో విలేకరులతో మాట్లాడారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ప్రజలకు పంపిణీ చేయకుండా ప్రభుత్వాన్ని అబాసు పాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని సునీల్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యేగా ప్రశాంత్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ప్రోటోకాల్ గౌరవము ఇచ్చిన దాన్ని కాపాడుకోవడం లేదని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందకుండా అహాకారం ప్రదర్శిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలు పెద్దగా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పిస్తు బ్రోకర్ వ్యవస్థను నిర్మూలించిందని అన్నారు. చెక్కుల గడువు ముగిసిపోతుందని హెచ్చరించన ఎమ్మెల్యే అధికార దర్పాన్ని చూపించడం వల్ల నియోజకవర్గానికి మంజూరైన 513 కల్యాణ చెక్కులు గడువు ముగిసిపోతే ప్రభుత్వానికి మాట్లాడి వాటిని రినివల్ చేయించామని సునీల్ కుమార్ అన్నారు. ఇప్పటి కూడా చెక్కులు పంపిణీ చేయకుండా అధికారులను తప్పుతోవ పట్టిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో రూ. 6వేలకు ఉన్న ట్రాక్టర్ ఇసుకను ప్రభుత్వంతో మాట్లాడి రూ. 2వేల 300 నుండి, 3వేల 300 మధ్యలోనే ఇసుకను అందించి సామాన్యులకు అండగా ఉంటున్నామని సునీల్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీగా నిబంధతతో క్రమశిక్షణతో ప్రజా పాలన కొనసాగిస్తుందని, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి విమర్శించడం ఏది తెలియదని సునీల్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ముత్యాల రాములు, శివనోల్లశివకుమార్, సుంకెటరవి,నర్సయ్య, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఏర్గట్ల:మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామపార్టీమాజీ అధ్యక్షుడు రాజారాం సహదేవ్‌తో పాటు చిన్న భూమన్నలు చేరగా సునీల్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వా నించారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, ముస్కు మోహన్, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ఓర్సు రాములు, దండెవోయిన సాయి కుమార్‌లు పాల్గొన్నారు

వరంగల్‌లో జరిగే సిల్వర్ జూబ్లీని విజయవంతం చేయాలి

● జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే



మహ్మద్‌నగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నిజాంసాగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి ఆవిర్భావం 25 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ పార్టీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే మాజీ హనుమంత్ షిండే పిలుపునిచ్చారు. మంగళవారం నిజాంసాగర్ మండల కేంద్రంలో టీఆర్ఎస్ కార్యాలయంలో నాయకుల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గా రెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షులు గైని విట్టల్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు రమేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, పిఎసిసి ఎస్ అధ్యక్షులు నరసింహారెడ్డి, కళ్యాణి విట్టల్ రెడ్డి, మాజీ సర్పంచ్లు, ఎంపిటిసిలు తదితరులున్నారు.

మహమ్మద్‌నగర్: బీఆర్ఎస్ బహిరంగసభకు కార్యకర్తలు, రైతులు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. మంగళవారం మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. ఈనెల 27 న బీఆర్ఎస్ వరంగల్‌లో రజోత్సవ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ సాధించిన మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సీనియర్ నాయకులు గంగారెడ్డి,మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, మనిష్‌రెడ్డి, మహేందర్, అమీర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు సౌత్‌క్యాంపస్‌లో శిక్షణ ప్రారంభం

భిక్కనూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్‌బాబు, అంజయ్య, హరిత, సబిత, లలిత, ప్రతిజ్ఞ, ఫౌండేషన్ ప్రతినిధులు సృజన్, సుప్రితా, బాలక్రిష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రతి మండలంలో కొన్ని వరికొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలను అప్పగించింది. దీంట్లో భాగంగానే చిన్న తక్కడ్‌పల్లి గ్రామంలో గల రెండు కేంద్రాలను అధికారులు ఐకెపి మహిళా సంఘాలకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగనాథ్, ఎంపిడివో లక్ష్మీకాంత్ రెడ్డి, గ్రామ మహిళ సంఘం అధ్యక్షురాలు నాగమణి, ఏపిఎం దూప్‌సింగ్, సిసిలు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన సుజాత(35)అనే వివాహిత మహిళ ఈ నెల 11వ తేదిన గుర్తు తెలియని పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ జిల్లా ఆసుపత్రిలో మంగళవారం మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. సుజాతకు 18సంవత్సరాల క్రితం నాగేష్ అనే వ్యక్తితో వివాహం జరిగిందని, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):బోధన్ మండలంలోని పెగడాపల్లి వెళ్లే రోడ్డులో ఉన్న లంగ్డాపూర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం అర్ధరాత్రి లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకుని ఘటన స్థలానికి వెళ్లి మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.మృతుడు మోస్రా మండలం గోవూరు గ్రామానికి చెందిన లాలుగాగుర్తించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.లారీని అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఆర్మూర్ రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డే గంగాధర్ (55) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని జిరాయత్ నగర్‌లో నివాసం ఉంటున్న గంగాధర్ సొంత పనుల నిమిత్తం ఎక్సెల్ బైక్ పైన కొత్తబస్టాండ్ ప్రాంతానికి వస్తుండగా క్లాక్ టవర్ వద్ద సిమెంట్ లారీ ఎక్సెల్‌ను ఢీ కొట్టింది. దీంతో గంగాధర్ అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీస్ లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చెరువులో పడి బీఆర్ఎస్ నాయకుడి మృతి

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూండ్ల చెరువు లో పడి బీఆర్ఎస్ నాయకుడు కుంట గంగామోహన్‌రెడ్డి (65) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. సోమవారం సాయం త్రం చెరువులో బట్టలు ఉతుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. కుంట గంగామోహన్‌రెడ్డి టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకుగా పనిచేశారు. పార్టీ అధి కారంలోకి రాకముందు,సకలజనుల సమ్మెసమయంలో పలువురు టీఆర్ ఎస్ నాయకులతో కలిసి అనేక ఉద్యమాలు చేశారు. మంగళవారం బం ధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయ న తెలిపారు.మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మినీ ట్యాంక్ బండ్‌పై జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పెద్ద చెరువు వద్ద నిర్మిస్తున్న మినీ ట్యాంక్ బండ్ వద్ద మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, బీసీ నాయకులు సతీష్, బహుజన సమాజ్ పార్టీ నాయకులు సాయిబాబు మంగళవారం వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే అనాథ పిల్లలను ఆదుకున్న మహా వ్యక్తి అని ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుటుంబాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మాజీమంత్రి హరీష్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే షకీల్ మాతృమూర్తి మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మాతృమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తదితరులున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



ప్రీతమ్ దేశాయ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు

బోధన్‌రూరల్,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీతా దేశాయ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్సీ కవితతో పాటు మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్‌లు పరామర్శించారు. ఇటీవల వారి పెద్ద కుమారుడు ప్రీతమ్ దేశాయ్ గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్సీ కవిత ఓదార్చారు. ప్రీతమ్ దేశాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రీతమ్ దేశాయ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, సాలూర షకీల్, గుమ్ముల అశోక్, గిర్ధావర్ గంగారెడ్డి, రుద్ర సత్యనారాయణ, రవి శంకర్ గౌడ్, పలువురు నాయకులు తదితరులున్నారు.

జానకంపేటలో పెద్దమ్మ తల్లి బోనాలు

ఎడపల్లి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భాజా భజంత్రీల నడుమ బోనమెత్తిన గ్రామ ముదిరాజ్ కులస్థులు సామూహికంగా గ్రామ శివారులో గల పెద్దమ్మ తల్లి ఆలయం వరకు నడిచి వెళ్లి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముదిరాజ్ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

'గీత కార్మికులను వీడీసీ బహిష్కరించలేదు'



తాళ్లరాంపూర్‌లో మాట్లాడుతున్న వీడీసీ సభ్యులు

ఏర్గట్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):తాళ్లరాంపూర్‌లోని గీత కార్మికులను మేము బహిష్కరించలేదని తాళ్లరాంపూర్ వీడీసీ సభ్యులు తెలిపారు. మంగళవారం గ్రామంలో వీడీసీ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గీత కార్మికులను బహిష్కరణ చేయలేదని, వారికి సంబంధిచిన చెట్లను వీడీసీ దహనం చేసినట్లు సీపీఎం నాయకులు నిజనిజాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని అన్నారు. తమ దగ్గర ఆధారాలు ఉన్నాయని మేము దేన్నికైనా సిద్ధమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బోనగిరి దేవన్న, ఉపాధ్యక్షుడు తమ్మడి రాకేష్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

బోనస్ కాజేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



కోటగిరి సొసైటీలో అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

కోటగిరి,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):రైతుల బోనస్‌ను రాజకీయ ముసుగులో కాజేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ డిమాండ్ చేశారు. కోటగిరి సహకార సంఘంలో బోనస్ అక్రమాలపై విచారణ జరిపేందుకు వచ్చిన అధికారులకు మంగళవారం సీపీఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్‌లో బోనస్ కోసం బోగస్ రైతులను సృష్టించి పలువురు రైస్‌మిల్లర్లు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై సుమారు 20లక్షల రూపాయల బోనస్ కాజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో దశల వారిగా ఉద్యమాలు చేపట్టడంతో జిల్లా అధికారులు విచారణకు ఆదేశించడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. అధికారులు రాజకీయ నాయకుల బెదిరింపులకు భయపడకుండా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సంఘంలో బోనస్ కాజేసిన ఏడుగురు వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం స్వాగతిస్తున్నామన్నారు. సమగ్ర విచారణ చేపట్టి బోనస్ కాజేసిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని మోసం చేసిన వ్యక్తుల పేర్లను విచారణ అనంతరం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. నిధులను రికవరీ చేసి సహకార సంఘానికి జమ చేయాలని కోరారు. అక్రమార్కులను తప్పించే ప్రయత్నం చేస్తే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గంగాధర్,రాములు, రాజు పాల్గొన్నారు.

నెల రోజులైనా కొనుగోలు కేంద్రం కరువు

భీమ్‌గల్, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి):వరికోతలు కోసిధాన్యం కుప్పలుపోసి నెల రోజులైనా కాంట పెడుతలేరని సిద్దపల్లి గ్రామానికి చెందిన రై తులు మంగళవారం భీమ్‌గల్ సొసైటీకి తరలివచ్చి చైర్మన్, కార్యదర్శి నిలదీశారు. తమ పక్క గ్రామమైన బెజ్జోరలో కొనుగోలు కేంద్రం ప్రారం భం చేసి 15 రోజులు గడిచినప్పటికి మాగ్రామంలో కాంటఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడ పోసినా కుప్పలు అక్కడే ఎండకు ఎండిపోతు న్నాయని ఈ విషయమై సొసైటీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించిన హామాలీ,సంచుల కొరత ఉందని దాట వేస్తూ జాప్యం చేస్తున్నారని దీంతో ప్రతినిత్యం కుప్పల వద్ద రాత్రి,పగలు వేళల్లో నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించిందని మండిపడ్డారు. మరో రెం డు రోజుల్లో తూకం ప్రారంభి స్తామని చైర్మన్, కార్యదర్శి హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నవీపేట,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం డ్రంకెన్‌డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిని మంగళవారం కోర్టులో హాజరుపర్చడం జరిగిందని ఎస్సై వినయ్ తెలిపారు. మండలంలోని అభంగపట్నంకు చెందిన వ్యక్తితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన మరో వ్యక్తి మద్యం తాగి వాహనాలు నడుపగా వీరిని మంగళవారం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి నూర్జహాన్ బేగం ఒక్కొక్కరికి రెండు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందని ఎస్సై పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్సై అన్నారు.

సాటాపూర్‌లో..

రెంజల్: మద్యం తాగి వాహనం నడిపిన మహారాష్ట్రకు చెందిన మధుకర్ కాంబ్లే అనే వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో సోమవారం వాహనాల తనిఖీల్లో భాగంగా మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని మంగళవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి ఒక రోజు జైలుశిక్ష విధించారని ఎస్సై తెలిపారు. మరో వ్యక్తికి రూ.4వేల జరిమాన విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై పేర్కొన్నారు.



భూ భారతితో..

సమస్యలు తీరేనా?

ఇందల్వాయి,ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ ద్వారా రైతుల సమస్యలు తీరనున్నాయా లేక ధరణి మాదిరిగానే ఏళ్ల తరబడి రెవెన్యూసేవలు పెండింగ్‌లోనే కొనసాగుతాయా అనే అంశంపై రైతులు చర్చించు కుంటున్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ప్రవేశపెట్టినా అనేక భూ సంబంధిత సమస్యలు అలాగే నిలిచిపోయాయి. దీంతో రైతులు ఏం చేయలేక ఏళ్ల తరబడి ఎదురు చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ధరణి స్థానంలో అనేక మార్పులుచేసి రాష్ట్రంలో భూ సమస్యలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే భూ భారతి పోర్టల్‌ను ఏప్రిల్ 14న ప్రారంభించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం అందించాలని రైతులు ఎదురు చూస్తున్నారు.

● పెండింగ్‌లో ఎన్నో దరఖాస్తులు

ధరణిలో ఎంతోమంది రైతుల భూములు రికార్డులు ఇతరుల పేర్లపై ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. అసైన్డ్‌మెంట్ భూములు సాదాబైనామా కేసులు ఉన్న భూమి కంటే తక్కువగా భూమిధరణిలో నమోదు ఆర్ఎస్ఆర్ లాంటి అనేక సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం చు ట్టూ తిరిగినా పనులు అక్కడే నిలిచి పోయాయి.

● ప్రధాన సమస్యలు ఇవే..

గ్రామీణ ప్రాంతాల్లో పట్టాభూములు అసైన్డ్ భూములుగా నమోదు కావడం, సాదాబైనామా భూములు, ఒకరి భూమి మరొకరి పేరుపై నమోదు, వ్యవసాయభూములు ఆబాదిగా నమోదు, భూ విస్తీర్ణంలో హెచ్చుతగులు లాంటి సమస్యలను రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్ ద్వారా రైతుల సమస్యలు తీరుతాయని ఎదురు చూస్తున్నారు.

9 ఏళ్లుగా పట్టా మారలేదు..

● టెక్మాల్ నరేందర్, సిర్నాపల్లి గ్రామస్థుడు



సిర్నాపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర 9ఏళ్ల క్రితం ఎకరం 3ఇసాల భూమి కొన్నాను. డిజిటల్ సైనింగ్, ఆధార్ కేవైసీ పెండింగ్‌తో భూమి పెండింగ్‌తో కొనుగోలు చేసిన వ్యక్తిపై పట్టామార్పిడీ కావడం లేదు. కొత్త పాస్‌బుక్‌లు సైతం రాలేదు. ఏం చేయాలో తోచక వదిలేశా.

భూ భారతి కోసం ఎదురుచూస్తున్నా

● గంగారాం, నల్లవెల్లి గ్రామస్థుడు



వారసత్వంగా నాలుగు ఎకరాల అసైన్డ్ భూమి నాకు వచ్చింది. అసైన్డ్ భూమి కాసులో నేనే ఉన్నా పట్టా మాత్రం వేరొకరి పేరుపై నమోదైంది. ధరణి కారణంగా భూమిని కోల్పోయా. రికార్డులో నా పేరు లేదు. భూ భారతి ద్వారానైనా నా సమస్య తీరుతుందని ఆశిస్తున్నా.

భూ భారతితో సమస్యలు పరిష్కరిస్తాం

● వెంకట్రావ్, తహసీల్దార్

భూ భారతి ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయి. ధరణిలో 33 మాడ్యుల్స్ ఉండగా భూభారతిలో తగ్గిస్తున్నారు. మరికొద్దిరోజుల్లోనే దిశానిర్దేశాలు వస్తాయి. త్వరలోనే రైతులు సమస్యలను పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గ్రామాభివృద్ధి కమిటీల

దౌర్జన్యాన్ని అరికట్టాలి

● సీపీఎం నాయకులు

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): బహిష్కరణ పేరుతో దౌర్జన్యాలకు పాల్పడుతున్న వీడీసీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల సీపీఎం నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గీత కార్మికుల కుటుంబాలపై బహిష్కరణ విధించిన వీడీసీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆర్డీవో ఆఫీస్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, తాళ్లరాంపూర్ మాజీసర్పంచ్ కోటగిరి రామాగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ కమిటీల నిరంకుశ చర్యలకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలలో వీడీసీల ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని అన్ని గ్రామాలలో వీడీసీలు సమాంతర ప్రభుత్వాలను నడుపుతున్నారని తమ మాట వినని వారికి కుల బహిష్కరణ చేస్తూ జరిమానాలు విధిస్తున్నారని వారన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా వీడీసీలను నిషేధించాలని డిమాండ్‌చేశారు. ఈనెల 22న చలో ఆర్మూర్ కార్యక్రమాన్ని చేపట్టామని ప్రజా సంఘాలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భూమన్న, కుందీ ప్ శర్మ, గంగాశంకర్, నాగరాజు, సాయిలు, ఓంకార్ పాల్గొన్నారు.

వీడీసీలను నిషేధించాలి: సీపీఎం

వర్ని: చట్టబద్ధత లేని గ్రామాభివృద్ధి కమిటీలు గ్రామాల్లో సమాంతర ప్రభుత్వాలను నడుపుతూ అణగారిన బడుగు, బలహీన ప్రజలను సాంఘిక బహిష్కరణ చేస్తూ చట్టాన్ని ధిక్కరిస్తున్నాయని, వాటిని ప్రభుత్వం వెంటనే నిషేధించాలని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ పిలుపుమేరకు మంగళవారం గ్రామాభివృద్ధి కమిటీలను నిషేధించాలని కోరుతూ వర్ని తహసీల్దార్ సాయిలుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నన్నేసాబ్ మాట్లాడుతూ ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గీత కార్మికులు గ్రామాభివృద్ధి కమిటీ మాట వినడం లేదని కల్లు గీత కార్మికుల కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేశారని మండిపడ్డారు. ఈత వనాలను తగలబెట్టి భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాయిబాబు, గాయత్రి ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వీడీసీలపై చర్యలు తీసుకోవాలి

బోధన్‌రూరల్: ఆర్మూర్ డివిజన్‌లో కొనసాగుతున్న వీడీసీలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు బోధన్ తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో కల్లు గీత కార్మికులపై వీడీసీలు దౌర్జన్యం చేస్తూ వారి కుటుంబాలను బహిష్కరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శ్రీరామ నవమి రోజు గౌడ మహిళలను గుడి నుంచి వెళ్లిపోవాలని ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసి గోపి, ప్రభాకర్, కాశీనాథ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.



పూజలో పాల్గొన్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఘనంగా గంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ కాడిచెరువు వద్ద కొలువుదీరిన గంగపుత్రుల ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి ఆలయ వార్షికోతవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో మూడోరోజైన మంగళవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గంగామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయా ఆవరణ నుంచి ఆలయం వరకు ఆలయ నిర్వాహకులు, గంగపుత్ర సంఘసభ్యులు ఆలయ అర్చకులు జగదంబాదేవి ఉపాసకులు మంత్రాజ్యం కృష్ణమా చార్యులు, గంగమ్మ దీక్షపరులు పూర్ణకుంబాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించగా గంగపుత్ర సంఘ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏనుగు గంగారెడ్డి, రాజాగౌడ్, బైకాని మహేష్, గంగపుత్ర సంఘం సుంకెట నారాయణ, ఉపాధ్యక్షుడు మోతే రవిందర్ సంఘ సభ్యులు గంగమ్మ దేవి దీక్షపరులు, గంగపుత్ర సంఘం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న గంగపుత్ర సంఘ మహిళలు

జానకంపేటలో ఫ్లెక్సీ వివాదం



పంచాయతీ కార్యదర్శితో గొడవ పడుతున్న ముదిరాజ్ కులస్థులు

ఎడపల్లి, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట గ్రామంలో మంగళవారం ఓ ఫ్లెక్సీకి సంబంధించిన వివాదం చోటుచేసుకుంది. గ్రామ కూడలిలో గల శివాజీచౌక్ వద్ద గ్రామ ముదిరాజ్ కులస్థులు పెద్దమ్మతల్లి బోనాల పండుగకు సంబంధించిన ఓ ఫ్లెక్సీని సోమవారం ఏర్పాటుచేశారు. మంగళవారం ఉదయం ఆ ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన ప్రదేశంలో లేకపోవడంతోపాటు ఫ్లెక్సీ చిరిగిపోయి ఉండడంతో పెద్దఎత్తున గ్రామ ముదిరాజ్ కులస్థులు శివాజీచౌక్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఫ్లెక్సీని గ్రామ పంచాయతీ కార్యదర్శి అకారణంగా తొలగించారని, పండుగపూట ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని పండుగ పూర్తి కాకముందే తొలగించారని వారు ఆరోపించారు. ఘటన స్థలానికి చేరుకున్న పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ దాస్ నాయక్ గ్రామస్థులకు సర్దిచెప్పారు. శివాజీ చౌక్‌లో ఏర్పాటు చేసిన పలు పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని పంచాయతీ సిబ్బందికి తెలపడంతో పలు పార్టీల ఫ్లెక్సీలతోపాటు ముదిరాజ్ కులస్థుల ఫ్లెక్సీని సైతం తమ సిబ్బంది తొలగించడంతో వివాదం చోటుచేసుకుందని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారికి సర్దిచెప్పారు. నూతన ఫ్లెక్సీని ఏర్పాటుచేయిస్తానని పంచాయతీ కార్యదర్శి తెలుపడంతో వివాదం సద్దుమణిగింది. శివాజీ చౌక్‌లో నూతన ఫెక్సీని పంచాయతీ కార్యదర్శి ఏర్పాటు చేయించారు.

19 నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరవధిక సమ్మె

● ప్రిన్సిపాల్‌కు సమ్మె నోటీసు అందజేత
● పరిపాలన అదనపు బాధ్యతలకు కాంట్రాక్టు అధ్యాపకుల రాజీనామా

భిక్కనూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పరిష్కరించకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 19 నుంచి భిక్కనూరు మండలంలోని బీటీస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్లు సౌత్ క్యాంపస్ కాంట్రాక్ట్ అధ్యాపకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సమ్మె నోటీసును ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌కు కాంట్రాక్ట్ అధ్యాపకులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా యూనివర్సిటీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే తమ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్న తమ గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జీవో నెం.21ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతోనే తాము ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా వెంటనే తమసేవలను గుర్తించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

● పరిపాలన అదనపు బాధ్యతలకు కాంట్రాక్టు అధ్యాపకుల రాజీనామా

కాంట్రాక్టు అధ్యాపకులపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ సౌత్‌క్యాంపస్‌లోని కాంట్రాక్ట్ అధ్యాపకులు వారు నిర్వహిస్తున్న అదనపు పరిపాలన బాధ్యతలకు రాజీనామా చేసి ఆ పత్రాలను ప్రిన్సిపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్డినేషన్ సభ్యులు నారాయణ, కాంట్రాక్ట్ అధ్యాపకులు యాలాద్రి, సునీత, వైశాలీ, సరిత, నిరంజన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

అన్నదాతల్లో అకాల వర్షభయం!

● పంట చేతికొచ్చే సమయంలో మబ్బులతో భయపెడుతున్న వరుణుడు
● రోజూ సాయంత్రం చల్లని గాలులు, చిరుజల్లులు ● ఆందోళన చెందుతున్న రైతులు



వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న దృశ్యం



గ్రామాల్లో మొదలైన వరి పంట కోతలు

డొంకేశ్వర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆకాశం మేఘావృతమైంది. మండలంలో వారం రోజులుగా చల్లని గాలులతో చిరుజల్లులు కురుస్తుండడంతో ఎప్పుడు వర్షం కురుస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన రైతులకు పంట చేతికి అందే సమయంలో మబ్బులు కమ్ముకోవడంతో దిగులు చెందుతున్నారు. మండలంలో గ్రామాల్లో యాసంగిలో సాగుచేసిన వరి పంట కొంతమేర చేతికి అందింది. మరికొంత పంటలు కోతలు ఊపందుకున్నాయి. ఇప్పటికే హార్వెస్టర్‌లతో కోతలకు వీలుగా పంటను ఆరపెడుతున్నారు. వాతావరణ మార్పులతో ఆకాశంలో మబ్బులు రావడంతో రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. మండలంలో రెండు రోజుల క్రితం వేకువ జామున వర్షం కురవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోత కోసే సమయంలో వరుణ దేవుడు కరుణ చూపాలని వేడుకుంటున్నారు.

9వేల ఎకరాల్లో వరి సాగు

మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో 9వేల ఎకరాల్లో వరి సాగైంది. మండల కేంద్రంలో వరి కోతలు ఇప్పటికే మొదలయ్యాయి. వరి కోతలు కొయడానికి రైతులు యంత్రాలను సైతం సిద్ధం చేసుకున్నారు. మ బ్బులు అలుముకున్న ఈ సమయంలో కోతలు చేయాలా వద్ద అని రైతులు సందిగ్ధంలో పడ్డారు. వర్షం పడితే పంటకు నష్టం జరుగుతుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. కోసిన పంట కల్లంలోకి చేరిన తరువాత వడ్లను ఎండపెట్టడానికి సైతం రైతుకు ఇబ్బంది అవుతుందని ఆలోచిస్తున్నారు. ఇంతలో ఈదురుగాలులు, అకాల వర్షాలు పడితే పంట నేల కొరిగి పూర్తిగా దెబ్బతింటుందని హార్వెస్టర్‌తో కోయడం కష్టంగా ఉంటుందని, కోత కోయడానికి రైతులకు హార్వెస్టర్ ఖర్చు కూడా ఎక్కువ అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూలీల ఖర్చు పెరుగుతోంది

● దొడ్డ నర్సయ్య, సిర్పూర్ గ్రామం



మూడు రోజులుగా ఉదయం, సాయంత్రం ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నాయి. వర్షం పడుతుందనే ఆందోళనలో ఆకాశం వైపు చూస్తున్నాం. నా వరి పంట కోతలు పూర్తయింది. మబ్బులతో కల్లంలో రోజు వడ్లను ఉదయం ఆరబెడుతున్నా. సాయంత్రం కుప్పవేసి టార్పలిన్ కవర్‌లు కప్పుతున్నాం. దీంతో రైతులకు కూలీల ఖర్చు ఎక్కువ అవుతుంది.

వర్షం కురిస్తే నష్టపోతాం

● ఎన్న గంగాధర్, రైతు దత్తాపూర్



నేను సాగు చేసిన నాలుగు ఎకరాల వరి పంటను కోత కోసి వారం రోజులు అవుతోంది. వడ్లను అమ్మేందుకు కల్లంలో సిద్ధంగా ఉంది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఆకాశంలో అంతా మబ్బులు కమ్ముకున్నాయి. వర్షం కురుస్తుందేమోనని భయంగా ఉంది. అకాల వర్షం కురిస్తే అంతా నష్టపోతాం.


బాన్సువాడలో బోనం ఎత్తుకున్న పోచారం, కాసుల

సల్లంగ సూడమ్మ.. నల్ల పోచమ్మ తల్లీ..

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 15: సల్లంగ సూడమ్మ నల్ల పోచమ్మ తల్లీ అంటూ మంగళవారం బాన్సువాడ పట్టణంలో మహిళలు బోనాల పండుగ నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు నెత్తిన బోనమెత్తి ఊరేగింపులో పాల్గొన్నారు. పోతరాజుల వేషధారణ, నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ పాల్గొని నెత్తిన బోనమెత్తుకున్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులున్నారు.

బారడి పోచమ్మకు బోనాల సమర్పణ

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపూర్ గ్రామంలో బారడి పోచమ్మ అమ్మవారికి గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి ఒకరు చొప్పున అమ్మవారికి బోనం సమర్పించారు. గ్రామ వీధుల గుండా బోనాల ఊరేగింపు నిర్వహించి ఆలయం వద్ద అమ్మవారికి బోనాలు సమర్పించారు. బుధవారం గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రుతుమతి అభియాన్ పోస్టర్ ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతంలోని మహిళల సురక్షితమైన ఆరోగ్యం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో రుతుమతి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏబీవీపీ రాష్ట్రకార్య సమితి సభ్యురాలు ప్రత్యూషా రెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రుతుమతి అభియాన్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు నెలసరి సమయంలో అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆ సమస్యలను సరైనపద్ధతిలో ఎదుర్కొనే పరిస్థితి లేకనే అట్టడుగు వర్గాల మహిళలు అనారోగ్యాలు కొని తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల నుండి సెప్టీ ప్యాడ్ స్వీకరించి గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అందజేయడమే ఈ కార్యక్రమముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.



భిక్కనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరులో క్రైస్తవుల శాంతి ర్యాలీ

భిక్కనూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెంది పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా భిక్కనూరు మండల కేంద్రంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శాంతి ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించి సినిమా టాకీసు చౌరస్తాలో ప్రవీణ్ పగడాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయాగ్రామాల పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


బీర్కూర్‌లో చెక్కు అందజేస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

బీర్కూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. బీర్కూర్‌కు చెందిన చామకూర నాగమణి అనారోగ్యంతో బాధపడుతోంది. అయితే కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్స చేయించారు. మూడు లక్షల వరకు ఖర్చు అయింది. సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా వేల రూపాయలు మంజూరు అయ్యాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితురాలి ఇంటికి వెళ్లి సీఎం సహాయ నిధి చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శశికాంత్, సందీప్, రఘు, ఆరీఫ్, శివాజీ, మన్నన్ తదితరులు పాల్గొన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

పంచాయతీ ఆస్తులను పరిరక్షించాలి

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మీనన్‌పల్లి గ్రామ పంచాయతీని మంగళవారం ఎంపీడీఓ ప్రకాష్ పరిశీలించారు. స్మశానవాటిక, కంపోస్ట్‌షెడ్, పల్లెప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువ ఉందని పల్లె ప్రకృతివనం,నర్సరీలలో మొక్కలకు నేరుగా ఎండ తగలకుండా చూడాలని తెలిపారు. మొక్కలకు అవసరమైన మోతాదులో నీరు అందించి మొక్కలను సంరక్షించాలని తెలిపారు. గ్రామపరిధిలోని గ్రామపంచాయతీ ఆస్తులను పరిరక్షించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ఇసన్నపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని పెద్దమల్లారెడ్డి విండో చైర్మన్ రాజాగౌడ్ అన్నారు. మంగళవారం పెద్దమల్లారెడ్డి విండో పరిధిలోని ఇసన్నపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోపు డబ్బులను రైతు ఖాతాలో వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ యాదగిరి, మాజీ సర్పంచ్ రాములు, తిర్మల్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: ప్రభుత్వం చేపడుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని రామారెడ్డి ఐకేపీ ఏపీఎం ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామంలో మంగళవారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ప్రతీ సంక్షేమ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పలు సలహాలు సూచనలు పద్ధతులను అందజేశారు. ఈ కార్యక్రమములో ఐకేపీ సంఘాల అధ్యక్షులు బాలమణి, జ్యోతి, మంజుల, అనురాధ, ఐకేపీ సీసీ దుర్గాదాస్, బీజేపీ గ్రామ అధ్యక్షుడు గంగారాం, పంచాయతీ కార్యదర్శి సెక్రెటరీ నరేష్, షహిన్నా, కవిత, విజయ, వీడీసీ అధ్యక్షుడు నర్సింలు, హన్మండ్లు, డ్వాక్రా మహిళలు, రైతులు, పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డిలో..

కాలభైరవ స్వామి ఆలయంలో వైభవంగా సింధూర పూజలు


కాలభైరవ స్వామిని అలంకరించిన దృశ్యం

రామారెడ్డి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చరణలతో క్షీరాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూ లైన్ ద్వారా భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం శనేశ్వర, నాగదేవత, శివాలయం, నవగ్రహాల గుడిదేవుళ్లకు మొక్కులు మొక్కి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారెడ్డి ఎస్సై నరేష్, ఆలయ కమిటీ మాజీ చైర్మెన్ గంజి సతీష్ గుప్తా, నాయకులు సామల శీలాసాగర్, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దండ రూపంలో దేవుని విగ్రహానికి వేశారు. అంతకుముందు ఆలయం వెనుక ఆవరణలో గల బావి నీటితో స్నానాలు చేసి తడి బట్టలతో భైరవుని గర్భగుడిలో పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు. తమకు ఇంకా శ్రీ కాలభైరవ స్వామి దేవుడు నచ్చితే మరింతగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు. కామారెడ్డి తదితర జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బూర్ల ప్రభు రామచంద్రం గుప్తా, ఆలయ కమిటీ మాజీ చైర్మెనులు, మాజీ ధర్మకర్తలు, పంతులు వంశీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ సిబ్బంది నాగరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు


తాడ్వాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తాడ్వాయి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ ప్రభుత్వ లక్ష్యమని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు అన్నారు. ఈయన మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన జై బాపు జై భీమ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వం అని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని వీధుల గుండా జై బాబు జై భీమ్ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ రాసిన రాజ్యాంగ పరిరక్షణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు అనంతరం జై బాబు జై భీమ్ కార్యక్రమాన్ని నిర్వహించిన మద్ది మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఎల్లారెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షులు గైని శివాజీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, నాయకులు సంజీవ్, సుధాకర్ రావు,మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


లింగంపేటలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

లింగంపేటలో వాహనాల తనిఖీ

లింగంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను వసూలు చేసినట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేవారు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని ఆయన సూచించారు. సీటు బెల్టు పెట్టని వారికి, హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న వారికి జరిమానాలు విధించినట్లు ఆయన తెలియజేశారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపితే వాటిని వెంటనే సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. బస్టాండ్ ఆవరణలో వివిధ గ్రామాల వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రకాశ్, కానిస్టేబుల్స్ మదన్‌లాల్, కాషాగౌడ్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిజామాబాద్ లేబర్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.


మాజీ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

నాయీ బ్రాహ్మణులకు పూర్తి సహకారం అందిస్తా..

• మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణంలోని నాయీ బ్రాహ్మణ కమిటీ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ సభ్యులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని వారి సమస్యలపై పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జొన్నల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వేణు, సాయికుమార్, కోశాధికారి దేవరాజ్, ప్రధాన కార్యదర్శి మురళి, సలహాదారులు సుదర్శన్, రామస్వామి, మల్లికార్జున్, సంగమేశ్వర్, లింగం తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో కంటి వైద్య శిబిరం

బీర్కూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పా టు చేశారు. అయితే ఈ శిబిరంలో సుమారు 30 మందికి వైద్యులు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షుడు, విఠల్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

చలో సెక్రటేరియట్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

భిక్కనూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జీవో నెం.21ని తక్షణమే రద్దు చేసి తమకు ఉద్యోగాలు కల్పించాలని ఈ నెల 17న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ పార్ట్‌టైం అధ్యాపకులు తెలిపారు. ఈ సందర్భంగా సౌత్ క్యాంపస్‌లో మంగళవారం చలో సెక్రటేరియట్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జీవో నె.21ని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని అన్నారు. వీరికి సౌత్ క్యాంపస్ కాంట్రాక్ట్ అధ్యాపకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకులు పాల్గొన్నారు.



సౌత్ క్యాంపస్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం


వినతి పత్రం అందిస్తున్న గిరిజన నాయకులు

పోడు పట్టా పాస్‌బుక్ దారులకు బ్యాంక్ రుణాలు ఇవ్వాలి

గాంధారి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పోడు భూములకు సంబంధించి రుణాలు ఇవ్వాలని మంగళవారం గాంధారి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌కు గిరిజన సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మోతీరాంనాయక్ మాట్లాడుతూ పోడు పట్టా పాస్‌బుక్‌దారులు గాంధారి మండలంలోని అత్యధికంగా ఉన్నారని ఇప్పటి వరకు వ్యవసాయదారులంతా ప్రైవేట్ అప్పులు తీసుకుని పంటలు పండించుకుని ఉన్నారని తెలిపారు. గిరిజన రైతులు అత్యధిక వడ్డీకి మోసపోతు ఉన్నారని పండించిన పంట మొత్తానికి దళారులకే అప్పగిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎటువంటి రుణాలు ఇవ్వక బ్యాంకులు దగ్గరకు రానీయక చాలా ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. ఈ సంవత్సరంలో కూడా అదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు.


మంటలను ఆర్పుతున్న అగ్ని మాపక సిబ్బంది

మద్నూర్‌లో అగ్ని ప్రమాదం

మద్నూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాయి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో ఆగ్రో ఇండస్ట్రీస్‌కు గ్రూపు సంబంధించిన రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. దీంతో సుమారు పదిహేను లక్షల ఆస్తి నష్టాన్ని నివారించగలిగారు. సమయానికి అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని నివారించడంతో ఆగ్రో ఇండస్ట్రీస్ యజమానులతో పాటు పత్తి మిల్లుల యజమానులు, ఊపిరి పీల్చుకున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం ఉగ్రవాయి మైసమ్మ ఆలయానికి సమీపంలో లారీ ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్లు దేవునిపల్లి ఎస్ఐ రాజు తెలిపారు. గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన నాగుల వినోద్‌కుమార్(30) బైక్‌పై అదే గ్రామానికి చెందిన జక్కుల దేవేందర్‌తో కలిసి మంగళవారం ఉదయం పని నిమిత్తం కామారెడ్డికి వస్తున్నారు. ఉగ్రవాయి మైసమ్మ వద్దకు రాగానే లారీ ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వినోద్‌కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా దేవేందర్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి తల్లి సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముస్లింల హక్కులను కాలరాస్తున్నారు

● ఎమ్మెల్సీ అమీర్‌ఖాన్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుతో ముస్లింల హక్కులను కాలరాస్తున్నారని ఎమ్మెల్సీ అమీర్‌ఖాన్ అన్నారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలో సమావేశం నిర్వహించారు. కేంద్రం తెచ్చిన వక్ఫ్ బిల్లు కేవలం వక్ఫ్ ఆస్తులపైనే కాదు ముస్లింల గౌరవం, హక్కులపై చేసిన దాడి అని తెలిపారు. ఈ బిల్లు వల్ల ప్రభుత్వానికి అపారమైన అధికారం వస్తుందన్నారు. బోర్డుల స్వతంత్రతను దెబ్బతీస్తుందని, ముస్లింల మతపరమైన సాంస్కృతిక హక్కులను ప్రమాదంలోకి నెట్టివేస్తుందని తెలిపారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే షిండే

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు హన్మంత్‌రెడ్డికి ఇటీవల మాతృ వియోగం కలిగింది. దీంతో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే హన్మంత్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. హన్మంత్ రెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తల్లి మరణంతో అధైర్యపడవద్దని ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి మండల పరి ధిలోని అన్నాసాగర్ గ్రామానికి చెందిన సాయిబాబాను మాజీ ఎంపీటీసీ గురుప్రతాప్ పరామర్శించారు. సాయిబాబా తన పొలం వద్దకు వెళ్తుండగా మార్గమధ్యలో అడవి పంది దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో ఎల్లారెడ్డి పట్టణంలోని దేవి ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా అతనిని మాజీ ఎంపీటీసీ పరామర్శించి అటవీశాఖాధికారులకు బాధితుడికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	- గుడ్ బ్యాడ్ అగ్లీ
ప్రియా 70	- జాక్
ప్రియా 35	- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి

బాన్సువాడ	
మహేశ్వరి	- జాక్
వెంకటేశ్వర	- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

